నేటి దినపత్రిక సూర్య www.suryaa.com 18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com సోమవారం 30-12-2024 పేజీలు: 02




## 2 నెలలు ఆ రైళ్లు బంద్

కుంభమేళాకు రైళ్లను మళ్లించడంతో పలు సర్వీసులను మార్చి 1 వరకు రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. తిరుపతి- కదరిదేవరపల్లి ప్యాసింజర్, గుంతకల్- తిరుపతి ప్యాసింజర్, తిరుపతి- హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను 2 నెలలు నిలిపేశారు. వీటితో పాటు తిరుపతి- కడప మీదుగా ధర్మవరం మార్గంలో నడిచే 6 రైళ్లను రద్దు చేశారు.





### నేటి దినపత్రిక సూర్య 2025 క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

నేటి దినపత్రిక సూర్య 2025 క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న పత్రిక చైర్మన్ &మేనేజింగ్ డైరెక్టర్ నూకారపు సూర్య ప్రకాశ రావు. చిత్రంలో సంస్థ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, న్యూస్ నెట్ వర్క్ ఇంచార్జి ఎస్. భాస్కర్ రావు, హెచ్ ఆర్ మేనేజర్ వై. నాగభూషణం, యాడ్స్ మేనేజర్లు, ఎ. సత్యనారాయణ, బి. శ్రీనివాస్, కృష్ణ మోహన్, వెబ్ సైట్ ఇంచార్జి అహ్మద్ మరియు వెబ్ టీం.



# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి..

# అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

తెలంగాణ అసెంబ్లీ ఇవాళ ప్రత్యేకంగా సమావేశం అయింది.. ఈనెల 26న కన్నుమూసిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సభ నివాళులు అర్పించింది.. సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభం అయింది.. ఈ సందర్భంగా సభ్యులు మన్మోహన్ సింగ్ కు సంతాపం తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ సేవలను గుర్తుచేసుకున్నారు. దీంతో పాటు తెలంగాణ ఏర్పాటులో మాజీ ప్రధాని పోషించిన కీలక పాత్రను అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ గుర్తుచేసుకునే అవకాశం ఉంది. మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించేందుకు ఏర్పాటు చేసిన తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌తో తెలంగాణకు ఉన్న బంధం ఎప్పటికీ మరిచిపోలేనిదని అన్నారు సీఎం రేవంత్. ఆయన చేసిన సేవలు గుర్తుండేలా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యుల సూచన మేరకు అవసరమైతే మరో చోటకు మారుస్తామన్నారు. మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలని కోరారు.

## మన్మోహన్‌సింగ్.. సైలెంట్ ఆర్కిటెక్చర్ ఆఫ్ ఇండియా: కేటీఆర్



మన్మోహన్ సింగ్ గొప్పతనం, సామర్థ్యం, జ్ఞానాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ (KTR) అన్నారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని చెప్పారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని తెలిపారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని గుర్తుచేశారు. అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ‘దివంగత మాజీ ప్రధాని మాన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నాం. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాం. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశం. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత లాటరీ ఎంట్రీ ద్వారా రాజకీయాలతో సంబంధ లేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ ‘ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది. నా దేశం మేల్కొని ఉంది..’ అంటూ ఆర్థిక వేత్తగా సంస్కరణలను ప్రవేశపెట్టే సందర్భంగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్దాంతం, పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్ సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్‌ను మనం చెప్పకోవచ్చు. విశ్వాసం అనే నేటి రాజకీయాల్లో అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పూర్తి స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్.

## మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలి : సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యింది. ఈనెల 26న కన్నుమూసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సభ సంతాపం తెలిపింది. సభ ప్రారంభం కాగానే సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను సీఎం రేవంత్ గుర్తుచేసుకున్నారు. ఆర్థిక సంస్కరణల రూపకల్ప మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. దేశానికి ఆయన విశిష్ట సేవలు అందించారన్నారు. ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని రేవంత్ అన్నారు. ‘మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలందించారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా సేవలందించారు. ప్రధానిగా పదేళ్లు అద్భుతమైన పాలన అందించారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు. తెలంగాణ రాష్ట్రానికి మన్మోహన్ ఆత్మబంధువు. తెలంగాణతో ఆయన బంధం విడదీయరానిది. రాష్ట్రహోదా కల్పించిన మానవతావాది. తెలంగాణ ప్రజల గుండెల్లో మన్మోహన్ స్థానం శాశ్వతం. ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించాలి’ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



## భారీగా కురుస్తున్న మంచు.. పరీక్షలు వాయిదా

కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడించారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి. వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ మంచు కురిసే వెదర్ నేపథ్యంలో డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు.



## ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన నాగచైతన్య దంపతులు


ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్‌లో భాగంగా.. దివంగత నటుడు అక్కినేని నాగేశ్వరరావుపై ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. మన్ కీ బాత్ 117వ ఎసిపోడ్‌లో అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. అక్కినేని తన కృషితో తెలుగు సినిమాను శిఖరాగ్రాన నిలబెట్టారని ఆయన కొనియాడారు. భారతీయ సంస్కృతి, వారసత్వ విలువలు ఆయన సినిమాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయని మోదీ మన్ కీ బాత్‌లో గుర్తుచేసుకున్నారు. ఏన్ఆర్‌పై మోదీ మాట్లాడటంతో తెలుగువారంతా ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుంటే.. మోడీ చేసిన వ్యాఖ్యలపై అక్కినేని నాగచైతన్య, శోభితా దుళిపాళ దంపతులు స్పందించారు. ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెబుతూ.. సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# రాశి సింగ్ నాభి అందాలు

నాలుగేళ్ల కిందట గ్లామర్ ఇండస్ట్రీకి వచ్చిన ఆమె, నటించిన నాలుగు సినిమాల్లో మూడు తెలుగులో చేసింది.కాకపోతే సరైన గుర్తింపు రాలేదు. అందుకోసం తీవ్రంగా ప్రయత్నాలు మొదలుపెట్టేసింది.గతేడాది పాపం పసివాడు వెబ్ సిరీస్‌లో నటించింది.. అభిమానులను ఆకట్టుకుంది. దీంతో క్రమంగా ఆఫర్లు రావడం మొదలుపెట్టింది. గ్లామర్ ఇండస్ట్రీకి రాకముందు ఎయిర్ హోస్టెస్ గా పని చేసిన అనుభవం ఈమె సొంతం.ఇప్పుడిప్పుడే అభిమానులను సొంతం చేసుకునే పనిలో పడింది. వారికి ఆకట్టుకునేందుకు రకరకాలుగా ఫోటోషూట్లు ఇస్తోంది.క్రిస్మస్ సందర్భంగా రాశి దిగిన ఫోటోలపై ఓ లుక్కేద్దాం.





## విమానయాన చరిత్రలో చీకటి నెలగా డిసెంబర్..

# ఏడు ప్రమాదాల్లో 240 మంది మృతి

2024 ముగింపుకు చేరింది. మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి.

**దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం.. 179 మంది దుర్మరణం**

దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

**డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి**

డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది. ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు. డిసెంబర్ 24న అర్జెంటీనాలో బార్డియర్ ఛాలెంజర్ 300 విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. డిసెంబర్ 17న హవాయిలోని హోనోలులులోని ఇనౌయే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఓ విమానం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. విమానం లిఫ్ట్‌ఆఫ్ అయిన వెంటనే నియంత్రణ కోల్పోయి భవనాన్ని ఢీట్టింది.



## అమెరికా మాజీ అధ్యక్షుడు

# జిమ్మి కార్టర్ కన్నుమూత

అమెరికా మాజీ అధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత జిమ్మీ కార్టర్ కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో జార్జియాలోని ప్లెయిన్స్‌లో ఉన్న తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు జేమ్స్ ఇ. కార్టర్ తెలిపారు. రెండు నెలల క్రితమే (అక్టోబర్ 1న) 100వ పుట్టిన రోజు జరుపుకున్న కార్టర్.. అమెరికాకు 39వ అధ్యక్షుడిగా వ్యవహరించారు. దీంతో అమెరికా చరిత్రలో ఎక్కువ రోజులు జీవించిన తొలి ప్రెసిడెంట్‌గా రికార్డు సృష్టించారు. 2002లో నోబెల్ శాంతి పురస్కారం దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆయన డెమొక్రటిక్ పార్టీ సభ్యుడిగా ఉన్నారు.

## యూసుఫ్‌గూడ బెటాలియన్ కానిస్టేబుల్

# గుండెపోటుతో మృతి

గత కొంత కాలంగా తెలంగాణ పోలీస్ శాఖలో సిబ్బంది వరుస ఆత్మహత్యలతో మృతి చెందుతున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు వేర్వేరు ఘటనల్లో ఆదివారం ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. విషం తాగి ఒకరు, ఉరేసుకుని మరొకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పుల బాధ తాళలేక కుటుంబంతో కలిసి ఏఆర్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబానికి విషం ఇచ్చి, తాను మాత్రం ఉరి వేసుకున్నాడు. దీంతో బాలకృష్ణ మృతి చెందాడు.. ఆయన కుటుంబం ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతుంది. ఇక కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాటూరి సాయికుమార్ (55) స్టేషన్ ఆవరణలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ రెండు ఘటనలు మరువక ముందే తాజాగా మరో సంఘటన చోటు చేసుకుంది. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు (45) గుండెపోటుతో మృతి చెందారు. 2012 బ్యాచ్‌కు చెందిన బాలరాజు బెటాలియన్‌లోని ఆర్మ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అథారిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో తన స్వస్థలమైన భువనగిరికి సెలవుపై వెళ్లాడు. అక్కడే ఇంటి వద్ద గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానకు తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని దవాఖానకు తరలిస్తుండగా దారి మధ్యలోనే మృతి చెందారు. ఈ మేరకు బెటాలియన్ అధికారులు తెలిపారు. బాలరాజు మృతితో బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. 3 రోజుల కిందట కామారెడ్డి జిల్లాకు చెందిన ఎస్సై సాయికుమార్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు.



# బీఆర్ఎస్ పార్టీ ఓ చచ్చిన పాము

భయపెట్టాలని చూస్తే కేటీఆర్, హరీశ్ రావు, కవిత అక్కర్లేదని, కేసీఆర్‌నే మొదట తీసుకుపోయేవాళ్లమని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం ఆయన సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ కేసుతో బీజేపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. తప్పు చేసిన వారిని దర్యాప్తు సంస్థలు పట్టుకువచ్చి విచారణ చేస్తాయని తెలిపారు. ఎవరు తప్పుచేసినా పోలీసులు కేసులు పెడతారన్నారు. కోర్టులోకి తీసుకెళ్తారనరని తెలిపారు. బీఆర్ఎస్ నేతలపై కేసులకు మోడీకి సంబంధం ఏంటన్నారు. కేసుల విషయంలో కవిత చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఓ చచ్చిన పాము అని విమర్శించారు. పాలు పోసిన, నీళ్లు పోసిన వచ్చేది లేదు, సచ్చేది లేదని, బీఆర్ఎస్ జోలికి తాము రావట్లేదన్నారు. బీసీలపై బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని, బీసీ కులగణనపై ఇప్పుడే ఎందుకు మాట్లాడుతన్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు చిత్త శుద్ధి ఉంటే బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని రఘునందన్ రావు అన్నారు.

# చైనాలో కొత్త 200 జైళ్లు కట్టించిన జిన్‌పింగ్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ దేశంలో కొత్తగా 200 జైళ్లను కట్టించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వానికి, కమ్యూనిస్టు పార్టీకి విధేయత చూపనివారిని, విశ్వాసంగా లేనివారిని అవినీతి పేరిట ఆయన వేటాడుతున్నారని, వారి కోసమే ఈ జైళ్లను నిర్మించారని సీఎన్ఎన్ వార్తాసంస్థ ఓ కథనంలో తెలిపింది. దృష్టి సారించిన వారిలో వ్యాపారవేత్తల నుంచి స్కూళ్లు-ఆస్పత్రుల యజమానులు, వివిధ రంగాల నిపుణులు కూడా ఉండటం గమనార్హం.

# రైతుల ఆందోళనతో స్తంభించిన పంజాబ్

రైతు డిమాండ్ల పరిష్కారంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతు సంఘాలు సోమవారం పంజాబ్ బంద్‌కు పిలుపునిచ్చాయి. అన్నదాతల డిమాండ్లను నెరవేర్చాలంటూ పంజాబ్ వ్యాప్తంగా కిసాన్ మజ్దూర్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చా బంద్ చేపట్టింది. ఈ బంద్‌తో రాష్ట్రం మొత్తం స్తంభించిపోయింది. రైతులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి బంద్‌లో పాల్గొన్నారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. రోడ్డు, రైలు మార్గాలను రైతులు దిగ్బంధించారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్, బటిండాలోని రాంపురా ఫుల్, మొహాలీలోని ఐఐఎస్ఈఆర్ చౌక్ వద్ద ఎయిర్‌పోర్ట్ రోడ్డు, కురాలి రోడ్ టోల్ ప్లాజా, లాల్రూ సమీపంలోని అంబాలా — ఢిల్లీ హైవే, ఖరార్ — మొరిండా హైవే సహా కీలక మార్గాలను రైతులు దిగ్బంధించారు. పంజాబ్ అంతటా ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మూతపడ్డాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200కిపైగా రోడ్లను రైతులు బ్లాక్ చేశారు. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రైతుల బంద్ రైళ్ల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ — పంజాబ్ మధ్య రాకపోకలు సాగించే దాదాపు 163 రైల్వే సర్వీసులకు రద్దయ్యాయి. విమానాలు, వైద్య, పెళ్లి, ఉద్యోగ ఇంటర్వ్యూ సహా అత్యవసర సేవలను బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. రైతుల బంద్ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మొహాలి జిల్లా అంతటా



దాదాపు 600 మంది పోలీసు సిబ్బంది మోహరించారు. సీనియర్ పోలీస్ అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ బంద్ కొనసాగనున్నట్లు రైతు సంఘాలు ప్రకటించాయి.



## కొత్త రేషన్ కార్డుల జారీపై

# కీలక నిర్ణయం?

కొత్త రేషన్ కార్డుల జారీకి విధివిధానాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. అర్హుల ఆదాయపరిమితి ప్రస్తుతం గ్రామాల్లో ₹1.50L, పట్టణాల్లో ₹2L ఉండగా, దాన్ని మరో ₹20K పెంచుతారని తెలుస్తోంది. ప్రజా పాలనలో 10L దరఖాస్తులు రాగా JAN మొదటి వారం నుంచి మరో అవకాశం ఇవ్వాలని యోచిస్తోంది. కార్డుల్లో మార్పులపై కూడా దరఖాస్తులు స్వీకరిస్తారని సమాచారం. 30న జరిగే క్యాబినెట్ భేటీలో తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

## నెతన్యాహుకు ప్రొస్టేట్ గ్రంథి శస్త్రచికిత్స విజయవంతం

ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు గత కొంతకాలంగా ప్రొస్టేట్ గ్రంథి సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. వాపు కారణంగా మూత్ర నాళ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం శస్త్ర చికిత్స చేయించుకున్నారు. నెతన్యాహుకు జెరూసలెంలోని హడస్సా మెడికల్ సెంటర్‌లో సర్జరీ జరిగింది. శస్త్ర చికిత్స విజయవంతమైనట్లు ఆస్పత్రి వర్గాలు తాజాగా వెల్లడించాయి. ప్రధాని నెతన్యాహు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని వెల్లడించారు. ఆయన ఎలాంటి క్యాన్సర్ బారిన పడలేదని వైద్యులు ప్రకటించారు. అయితే కొన్ని రోజులపాటు వైద్యుల పరిశీలనలోనే ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రొస్టేట్ గ్రంథి పరిమాణం పెరిగిన కారణంగా మూత్రనాళంలో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు వైద్యులు ధృవీకరించారని.. ప్రొస్టేట్‌ను తొలగించేందుకు సర్జరీ అవసరం అయినట్లు వెల్లడించింది.



# నాలుగో టెస్ట్‌లో భారత్ భారీ ఓటమి

బోర్డర్ — గవాస్కర్ టోర్నమెంట్‌లో భాగంగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో భారత్ ఓటమి పాలైంది. 340 టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇండియా 155 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో 186 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించింది. భారత బ్యాటర్‌లలో యశస్వి జైశ్వల్ 84 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా.. పంత్ 30 పరుగులతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్ మూడు వికెట్లు, బోలాండ్ 3, నాథన్ లియాన్ 2, మిచెల్ స్టార్క్, హెడ్ చెరో వికెట్ తీశారు.మెల్‌బోర్న్ టెస్టు ఫలితం టీమిండియాకు అనుకూలంగా రాలేదు. దీంతో ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ భారీ విజయంతో సిరీస్‌లోనూ ముందంజ వేసింది. మెల్‌బోర్న్ టెస్టులో భారత్‌కు 340 పరుగుల విజయలక్ష్యాన్ని ఆస్ట్రేలియా నిర్దేశించగా, దానిని ఛేదించే క్రమంలో టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 155 పరుగులకే పరిమితం చేసింది. టోటల్ 300 ప్లస్ ఛేజింగ్ లో టీమ్ ఇండియా ఓటమిని ఎదుర్కోవడం టెస్టు క్రికెట్ లో ఇది 49వ సారి కావడం విశేషం.

చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజార్చుకున్న భారత్.. నాలుగో రోజు 9 వికెట్లు కోల్పోయి 333 పరుగుల




ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా.. 5వ రోజు తన స్కోరుకు మరో 6 పరుగులు జోడించి భారత్‌కు 340 పరుగుల లక్ష్యాన్ని అందించింది. ఈ లక్ష్యాన్ని అధిగమిస్తే MCGలో టీమిండియా చరిత్ర సృష్టించినట్లే అవుతుంది. ఎందుకంటే ఇప్పటివరకు ఈ మైదానంలో అత్యంత విజయవంతమైన ఛేజింగ్ విషయానికి వస్తే 332 పరుగులు. కానీ, ఇది జరగలేదు.